ప్రజాశక్తి
శుక్రవారం 14 నవంబర్ 2025

బాలాజీ క్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్‌పై దర్యాప్తు

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రంలో గల బాలాజీ క్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్‌పై సాలూరు మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.శివకుమార్ గురువారం దర్యాప్తు నిర్వహించారు. అనధికారికంగా క్లినిక్ నిర్వహిస్తున్నారని, వైద్యం నిర్లక్ష్యంగా చేస్తున్నారని ఆరోపిస్తూ ఈనెల 10న ఐటిడిఎ పిఒకు మండలంలోని మోదుగ పంచాయతీ కాట్రగుడ్డికి చెందిన గెమ్మెల పోతయ్య, భార్య లక్ష్మి ఫిర్యాదు చేశారు. క్లినిక్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల తమ మూడునెలల కుమార్తె మృతి చెందిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్‌ను దర్యాప్తుగా అధికారిగా నియమించారు. పిఒ ఆదేశాల మేరకు శివకుమార్ దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తు నివేదికను పిఒకు అందజేస్తామని శివకుమార్ తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో మంత్రి సంధ్యారాణి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి, జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - సాలూరు

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. రాష్ట్ర 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మంత్రి జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు చేరిన వెంటనే వారి ఖాతాలకు డబ్బులు జమ చేస్తామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ధాన్యం సేకరణలో పారదర్శకత, సమయపాలన, రైతులకు తగిన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతండగా పూర్తి చేయాలని సూచించారు.

2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం : జెసి

అనంతరం జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్దేశించిన 2.5 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం గతేడాది కొనుగోలు చేసిన 2.24 లక్షల మెట్రిక్ టన్నుల కంటే సుమారు 10శాతం ఎక్కువన్నారు. జిల్లాలో సుమారు 1.86 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారని, ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. ఈ సీజన్‌లో దాదాపు 4లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 281 రైతు భరోసా కేంద్రాలను గ్రూపింగ్ చేసి మొత్తం 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో కొనుగోలు సహాయక సంస్థల ద్వారా సిబ్బందిని నియమించి, అవసరమైన పరికరాలు అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 7లక్షల గోనె సంచులను సిద్ధం చేసి, మిల్లర్ల నుంచి కొనుగోలు కేంద్రాలకు తరలించామన్నారు. కూలీలను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టమని తెలిపారు. ధాన్యం రవాణాకు ఇప్పటికే సుమారు 1050 వాహనాలను రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసి, మరో 450 నుంచి 500 వాహనాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ కనెక్ట్ చేయడం చేశామని తెలిపారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, తహశీల్దార్ నీలకంఠారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎఎంసి చైర్మెన్ ముఖీ సూర్యనారాయణ, పట్టణ, మండల, పాచిపెంట, మక్కువ మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గూడెపు యుగంధర్, గుళ్ల వేణుగోపాల్, ఎఎంసి డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఒక పక్క వంటలు... మరో పక్క తరగతులు

- ఇరుకైన గదితో అవస్థలు
- విద్యార్థులకు తిప్పలు
- పట్టించుకోని ప్రభుత్వం
- యు.వెంకంపేట పాఠశాల దుస్థితి

ఒకే గదిలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు, మరోపక్క వంటపండుతున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పాలకులు, అధికారులు ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నారే తప్ప ఆ దిశగా చర్యలు లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఎక్కడి సమస్యలు అక్కడనే దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రానికి కూత దూరంలో యు.వెంకంపేట గ్రామ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 23 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఒకే ఒక్క భవనం ఉండడంతో ఒక ఉపాధ్యాయుడు లోపల, మరో మరో ఉపాధ్యాయులు బయట వరండాలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు అదనపు గది సౌకర్యం లేకపోవడంతో ఇరుకైన క్లాస్ రూములోనే వంట నిర్వాహకులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేయడంతో ఇటు విద్యార్థులకు అటువంట నిర్వాహకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అన్ని మరుగు దొడ్డులోనే

విద్యార్థులు భోజనం ముందు ప్లేట్లు శుభ్రం చేసుకోవడం, అలాగే చేతులు కడుక్కోవడం, భోజనం అనంతరం తినే ప్లేట్లు మరుగుదొడ్డిలోనే శుభ్రం చేసుకుంటున్నారు. అపరిశుభ్రత వాతావరణమైనప్పటికీ విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. ఈ పాఠశాల నిర్మాణ పనులు చేపట్టి దాదాపుగా ఐదు దశాబ్దాలు పూర్తి కావచ్చింది. ఇప్పటికే భవనం పూర్తిస్థాయిలో శిథిల వ్యవస్థకు చేరుకోవడంతో శ్లాబ్ పెచ్చులు ఊడిపడి దర్శనమిస్తుంది. చిన్నపాటి చినుకుపడిన వర్షం నీరంతా శ్లాబ్ పైనుంచి వర్షం నీరు కిందకు జారుతుండడంతో ఏ పరిస్థితులోనైనా భవనం కుప్పకూలే పరిస్థితి ఉందని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. కొత్తగా భవనం నిర్మించాలన్నా ఈ గ్రామంలో స్థల సమస్య ఏర్పడడంతో అదే భవనం కూల్చి నిర్మాణ పనులు చేపట్టేందుకు గ్రామంలో ఉన్న రెండు గ్రూపుల మధ్య అభ్యంతరాలు ఏర్పడడంతో విద్యాశాఖ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. కనీసం విద్యార్థులు విశ్రాంత సమయంలో ఆటలు ఆడుకోవాలన్నా పక్కన , ఎదురుగా రహదారులు ఉండడం వల్ల ఇరుకైన గదుల్లోనే మగ్గిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, సమయం వచ్చినప్పుడల్లా పాలకులు, విద్యాశాఖ అధికారులు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారు తప్ప ఆ దిశగా చర్యలు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారు.. యు వెంకంపేట గ్రామ పాఠశాలతో పాటు కంబర వలస, వీరఘట్టంలోనే కోమటి వీధి పాఠశాల, నీలానగరం గ్రామ పాఠశాలలు ఇరుగ్గా ఉన్నందున వంటశాలలు లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇంటి వద్ద వంటలు చేసి పాఠశాలలకు తీసుకువచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. చిట్టపూడి వలసలో కూడా ఒకే ఒక భవనం ఉండడం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు కొంత మొత్తాలను పోగు చేసి అదనంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం విద్యార్థులు అందులో విద్యను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ జిల్లా ఉన్న స్థాయి అధికారులు స్పందించి పాఠశాలలో ఉన్న స్థితిగతులను మెరుగుపరిచేందుకు. తగు చర్యలు తీసుకోవాలని, స్థానికులు ముక్తకంఠతో కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎంఇఒ- 2 ఆర్ ఆనందరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా యు వెంకంపేట పాఠశాలను పరిశీలించి సమగ్ర నివేదికను తయారుచేసి సమగ్ర శిక్ష ఎపిసికి నివేదికను అందజేస్తామని తెలిపారు.

మరుగుదొడ్డిలో కంచాలు కడుగుతున్న విద్యార్థులు

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఆలిండియా మహాసభలను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - పార్వతీపురం

డిసెంబర్ 31నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న 18వ సిఐటియు ఆలిండియా మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మహాసభల గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.సుబ్బరావమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ప్రాణాలు తెగించి సాధించుకున్న చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకురావడం దుర్మార్గమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో సిఐటియు ఆలిండియా మహాసభలు పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో జరగడం ప్రాధాన్యత ఉందని తెలిపారు. కనుక కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలన్నారు. ఇలాంటి తరుణంలో జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభ లను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శ్రమచేసి సంపదని సృష్టిస్తున్న కార్మికులకు హక్కులు కల్పించకుండా పారిశ్రామిక సదస్సు పేరుతో కార్మికుల శక్తిని, శ్రమని ఎలా దోపిడీ చేసుకోవాలో కార్పొరేట్లతో కుమ్మక్కవుతోం దని చెప్పారు. ఈ నేపథ్యంలో లేబర్ సమ్మిట్ అని చెప్పి కార్మికుల కోసం హక్కుల కోసం చట్టాల అమలు, లేబర్ కోడ్లు రద్దు కోసం ఆల్ ఇండియా మహాసభల సందర్భంగా పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు, రెడ్డి వేణు, బివి రమణ, శాంతి కుమారి, జ్యోతిలక్ష్మి, వి.ఇందిర, జి వెంకటరమణ, ఎన్ వై నాయుడు, ఆర్.రాము, హేమాప్రభ, శివాని, పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

వరహాల గెడ్డ భూమికి శాశ్వత రక్షణ కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం పట్టణ నడిబొడ్డున ఇటీవల ఆక్రమణకు గురైన వరహాల గెడ్డ భూమి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేయడం ఒక్కటే పరిష్కారం కాదు. తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు.. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని, జిరాయితీ సర్వే నెంబర్‌తో ప్రభుత్వ భూమిని కలిపి 1200 గజాల స్థలాన్ని విశాఖపట్నం షాపింగ్ మాల్ యజమానికి అమ్మకం చేశారన్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ఏదైనా ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలో ఫిజికల్ వెరిఫికేషన్ చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సిన జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు లంచాలకు అమ్ముడు పోయి ఈ అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం ఆక్రమిత స్థలమని నిర్ధారించినప్పటికీ రిజిస్ట్రేషన్ అధికారులు ఈ వ్యవహారాన్ని సమర్థించుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా వరహాలగెడ్డ ఆక్రమణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి మొత్తం గెడ్డలో జరిగిన ఆక్రమణలన్నిటిని గుర్తించి శాశ్వత ప్రాతిపదిక తొలగించాలని గంగునాయుడు డిమాండ్ చేశారు.

సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి, సబ్‌కలెక్టర్లు

నేటి నుంచి సహకార వారోత్సవాలు : జెసి

పార్వతీపురం : సహకార వారోత్సవాల కార్యక్రమాన్ని ఈనెల 14 నుండి 20 వరకూ నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో 72వ అఖిల భారత సహకార వారోత్సవాల గోడ పత్రికను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా, రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డిఎస్ఒ, డిసిఎంఎస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పోలీస్ స్టేషన్లలో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక పోలీస్ స్టేషన్, డిఎస్‌పి కార్యాలయాన్ని మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు, పోక్సో కేసులు ఎలా దర్యాప్తు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. నాటుసారా, గంజాయి అక్రమ రవాణాపై ఆరా తీయాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలు ఎలా ఉన్నాయని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ ఎ.ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి సిబ్బంది ఉన్నారు.

సీతంపేట: వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి మాధవ్ రెడ్డి తనిఖీ చేశారు. ప్రొబేషనరీ ఆర్ఎస్సైలతో మమేకమై వారు నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకొని, నిర్వహించాల్సిన విధులపై తగు సూచనలు, సలహాలిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా సంరక్షణ పోలీసు సిబ్బందితో మమేకమై, క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. రిసెప్షను కౌంటర్‌ను సందర్శించి, రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని కంప్యూటర్‌లో పిటిషన్లు ఎంటర్ చేస్తున్నారా, చేస్తే ఏ రోల్‌లో ఎంటర్ చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. స్టేషనులో ఎంతమంది సిబ్బంది పని చేస్తుంది, వారు ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు నిర్వహణ, సిబ్బంది విధులు పట్ల సంతృప్తిని వ్యక్తిపర్చి, పలు ముఖ్యమైన గ్రేవ్ కేసులు రికార్డు ఫైల్ క్షుణ్ణంగా పరిశీలించి పెండిగ్లో ఉన్న ప్రతి కేసును త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో జరుగుతున్న నేరాలు, శాంతిభద్రతల సమస్యలు, నాటు సారా, గంజాయి వినియోగదారులు, విక్రయదారుల సమాచారాన్ని సేకరించి, సంబంధిత పోలీసు అధికారికి అందించాలన్నారు. అలాగే సైబర్ క్రైమ్, డ్రగ్స్, బ్లాక్ మేజిక్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పాలకొండ డిఎస్‌పి, సిఐ, ఎస్ఐలు అమ్మన్నరావు, కళాధర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు, పిహెచ్‌సిల్లో జెసి ఆకస్మిక తనిఖీ

కొత్తవలస గిరిజన సంక్షేమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి - సాలూరు

మండలం లోని కొత్తవలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం సందర్శించారు. పాఠశాల సిబ్బందితో విద్యార్థుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, హాస్టల్ ప్రాంగణంలో పారిశుధ్యంపై సిబ్బందికి జెసి పలు సూచనలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎం.మామిడిపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిని, పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు తమ చదువులో సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. చురుగ్గా లేని విద్యార్థులను అన్ని రంగాల్లో చురుగ్గా పాల్గొనేలా చేయాలని, విద్యార్థులకు దేనిపై ఆసక్తి ఉందో గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. మామిడిపల్లి పిహెచ్‌సిని సందర్శించి రక్త పరీక్ష కేంద్రాన్ని, రికార్డులను పరిశీలించారు. పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య స్థితిని నిర్ధారించే ముందు రోగులకు అవసరమైన పరీక్షలను చేయాలని సిబ్బందికి జెసి సూచించారు. అక్కడి నుంచి మక్కువ మండలం శంబర పిహెచ్‌సిని సందర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడుతూ వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వైద్య సేవల్లో ఎటువంటి అంతరాయం ఉండకూడదని జెసి వైద్యులను ఆదేశించారు. పిహెచ్‌సి లోపల, బైట పారిశుధ్యాన్ని పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

ధాన్యం సేకరణపై అవగాహన

పార్వతీపురం : స్థానిక కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ కోసం వరి సేకరణపై జిల్లాలోని తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, సిఎస్‌డిటిఎస్, విఆర్ఒలు, విఎఎలు, కస్టోడియన్ అధికారులతో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరా మేనేజర్, జిల్లా జిల్లా క్రీడా ప్రాధికారత అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి జెసి నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

ఐక్యతా మార్చ్‌కు ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి పురస్కరించుకుని కలెక్టర్, మై భరత్ (యూత్ వెల్ఫేర్) ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించబోయే ఐక్యతా మార్చ్‌కు ముందస్తు ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి ఆధ్వర్యంలో తన ఛాంబర్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతను చాటి చెప్పడానికి ఐక్యతా మార్చ్ కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్దార్ పటేల్ దేశ ఐక్యతకు ప్రతీకని, ఆయన జయంతి సందర్భంగా నిర్వహించే ఐక్యతా మార్చ్ యువతలో దేశభక్తి, సేవా స్ఫూర్తిని పెంపొందించేలా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఐక్యతా మార్చ్ నిర్వహించడానికి రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్నామని ఆమె అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంతంగా కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. అధికారులు సమన్వయంతో కార్యక్రమాలు విజయవంతమ య్యేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాఎంఎస్. భాస్కరరావు, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్, జిల్లా క్రీడా ప్రాధికారిత అధికారి వాసుదేవరావు, డిఇఒ రాజ్‌కుమార్, డిఐఇఒ, యూత్ వెల్ఫేర్ అధికారి ప్రేమ్ భరత్, పార్వతీపురం సిఐ, మెప్మా అధికారి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు పిఒ అభినందనలు

విద్యార్థులను అభినందిస్తున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ప్రజాశక్తి -సీతంపేట

జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీతంపేట ఐటిడిఎకు చెందిన బాల, బాలికలు అన్ని విభాగాల్లో ఓవరాల్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వీరిని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, శ్రీకాకుళం అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ అభినందించారు. అదే విధంగా ఐటిడిఎ ఎపిఒ, డిడి, డిప్యూటీ డిఇఒలు కూడా అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్చార్జ్ జాకబ్, ఇతర పీడీలు, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఆర్‌బిఎస్‌కె జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పరిశుభ్రత పాటించడం, పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యం మెరుగ్గా ఉంటూ, వ్యాదులు దరి చేరవని జిల్లా ఆర్.ఎస్‌కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు వెల్లడించారు. స్థానిక ఎంజెపిబిసి వెల్ఫేర్ హాస్టల్‌ను వైద్య బృందంతో కలిసి గురువారం సందర్శించారు. తొలుత సిక్ రిజిస్టర్ తనిఖీ చేసి నమోదు చేసిన ఆరోగ్య సమస్యలు పరిశీలించారు. విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై ఆరా తీశారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డు పరిశీలించి నార్మల్, మైల్డ్, మోడరేట్, సివియర్ ఎనీమియాగా ఎంత మంది విద్యార్థులకు నిర్ధారించారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. ఏ చిన్న అనారోగ్య లక్షణాన్ని గుర్తించినా జాప్యం లేకుండా తగు చికిత్స అందించాలని హాస్టల్, వైద్య సిబ్బందికి సూచించారు. కిచెన్ సిబ్బందితో మాట్లాడి పరిశుభ్రత తీరుపై ఆరా తీశారు. ప్రతివారం హాస్టల్‌లో డ్రైడే నిర్వహించాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఆరోగ్యంపై రక్తహీనత ఎక్కువగా ప్రభావం చూపుతుందని, తప్పనిసరిగా నిర్దేశించి మోతాదులో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని సూచించారు. పోషకాహారం సక్రమంగా తీసుకోవాలని ఆహారం విషయంలో అశ్రద్ధ చూపరాదని హితవు పలికారు. కిశోర బాలికల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. ఆర్‌కెఎస్‌కెలో బాగంగా ప్రభుత్వాసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో కౌమారుల స్నేహ పూర్వక ఆరోగ్య క్లినిక్‌ల (ఎఎఫ్.హెచ్.సి) ద్వారా కిశోర బాలికలకు మెరుగైన వైద్య సేవలు, సూచనలు, కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎమ్. షకీల మొహమ్మద్, డెమో డి.గిరిబాబు, ఇఒ వాసుదేవరావు, సూపర్వైజర్ బి.పుష్ప, వైద్య సిబ్బంది సావిత్రి,శాంతి, హాస్టల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కును అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

పేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - సాలూరు

వివిధ రకాల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రులకు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రాణాలను కాపాడుకుంటున్న అభాగ్యులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం ఆమె క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి కింద సుమారు రూ.1,69,979 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చెక్కును అందుకున్న వారిలో జడ త్రినాథ (మరిపల్లి, సాలూరు మండలం), తెలుగు వెంకటరమణ (పణుకువలస, పాచిపెంట మండలం), సారికాన అయిమ్మ (పెద్దమేడపల్లి), మెంటాడ) ఉన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, నాయకులు చొక్కాపు త్రినాధరావు, కోసిన భోయిన వెంకటరమణ, కోట లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీతానగరం : సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయచంద్ర స్థానిక టిడిపి కార్యాలయంలో పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారిలో సెనపతి అప్పలస్వామి, వంజరపు కళావతి(అంటిపేట, లచ్చయ్యపేట సీతానగరం మండలం), పట్నాన సంగీతరాణి (వలగర, బలిజిపేట మండలం) ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**గుమ్మలక్ష్మీపురం** : కొమరాడ మండలం పరశురాంపురం గ్రామానికి చెందిన అధికారి కృష్ణ, జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడికి చెందిన రెడ్డల తాతబాబు అనారోగ్యం బారినపడి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకొని వారికి సిఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే జగదీశ్వరి అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును గురువారం స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణిని ఎంపిడిఒ ప్రశ్నించగా 224 మంది విద్యార్థులు ఉన్నారని, 167 మందికి భోజన సదుపాయం కల్పిస్తున్నామని, మిగిలిన వారు ఇంటి వద్ద నుంచి కేరేజీలు తెచ్చుకుంటున్నట్లు వివరణ ఇచ్చారు. అలాగే గ్యాస్‌తో వంటలు చేసి విద్యార్థులకు భోజన సదుపాయం అందించాల్సి ఉండగా, నిర్వాహకులు కట్టెలతో వంటలు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నట్లు గుర్తించారు. ఇలా వంటలు చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి -బలిజిపేట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్‌ఎ- 1 పరీక్షలను ఎంఇఒ-1 ఎస్.సింహాచలం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 6,7 తరగతుల విద్యార్థులకు జరుగుతున్న గణితం పరీక్షను పరిశీలించారు. అసెస్మెంట్ బుక్లెట్‌లో విద్యార్థులు రాస్తున్న విధానం పరిశీలించి, తగిన సూచనలు చేశారు. చక్కటి దస్తూరితో జవాబులు రాయాలని సూచించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ శుక్రవారం బాలల దినోత్సవం అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. శుక్రవారం జరుగనున్న పరీక్ష ప్రాథమిక పాఠశాలలకు ఈనెల 17న, హై స్కూలుకు ఈనెల 20న నిర్వహించాలన్నారు. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారని ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం బి.వెంకటరమణ పాల్గొన్నారు.

రోహిత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

రాకెట్ సైన్స్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రోహిత్‌ను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం టిడిపి కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. రాకెట్ సైన్స్, ఏరో నాటికల్ విభాగంలోని కొన్ని అంశాలను తెలుసుకొనేందుకు ఈనెల 5న ఢిల్లీ వెళ్లిన రోహిత్ ఈ రంగాల్లో తన ప్రతిభ కనబర్చి అక్కడ అందర్నీ ఆకట్టుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాకెట్ సైన్స్ విభాగంలో పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చి మన జిల్లా ఖ్యాతిని దశ దిశల వ్యాపించేలా చేయాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో తన అనుభవాలను ఈ విద్యార్థి ఎమ్మెల్యేకు వివరించారు.



విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న ఎఇ ఉమామహేశ్వరరావు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలంలో హౌసింగ్ ఎఇగా విధులు నిర్వహిస్తున్న ఫోక్ సింగర్ లావేటి ఉమామహేశ్వరరావు తన పుట్టినరోజు సందర్భంగా గురువారం తన స్వగ్రామమైన నవగాంలో గల ఎంపిపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే మనిషి ఉన్నత స్థాయికి ఎదగగలడని, కావున ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులు కృషి, క్రమశిక్షణతో చదువుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు లావేటి ఉమామహేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ యువత అనిల్ కుమార్, నరేష్, కిరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వైద్యాధికారి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం వైద్యాధికారి పి.ఉషారాణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పిహెచ్‌సి ఆవరణను పరిశుభ్రం చేసి మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దడానికి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రం చేయించామని తెలిపారు. అనంతరం కొబ్బరి, జామి, నేరేడు తదితర రకాల పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఎస్.రమణ, యుడిసి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న వైద్యాధికారి ఉషారాణి

తరలిపోతున్న వృక్ష సంపద

చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి - కురుపాం

చెట్ల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ. అలాంటి చెట్లను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని ప్రభుత్వం లక్షలు వెచ్చించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అయితే మండలంలో మాత్రం అందుకు భిన్నంగా చెట్లను యథేచ్ఛగా నరికి రోజూ ట్రాక్టర్ల ద్వారా టన్నుల కొద్దీ కలపను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కలప అక్రమ తరలింపు సంబంధిత ఆటవీశాఖ అధికారుల ప్రమేయంతో వారి కనుసైగల్లోనే కొనసాగుతుందనడంలో సందేశం లేదు. ఎందుకంటే ప్రధాన రహదారి పక్కనే ఉన్న అటవీశాఖ కార్యాలయానికి పక్కనుండే ట్రాక్టర్లు లోడుతో రాత్రీ పగలు తేడా లేకుండా వెళ్తున్నాయి. అంతేకాకుండా రాత్రి సమయంలో కర్రలోడుతో వెళ్తున్న ట్రాక్టర్లకు కనీసం ఎటువంటి సూచికలు లేకపోవడంతో వెనుక వైపు నుండి ద్విచక్ర వాహనంతో వెళ్తున్న వారు ఈ పది నెలల కాలంలో వేర్వేరు ప్రాంతాల వద్ద గుద్ది ఇద్దరు మరణించిన సంఘటనలు చాలా బాధాకరం. చెట్ల పరిరక్షణ, అటవీ సంపదను కాపాడేందుకు గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో కొందరు అటవీశాఖ అధికారులు అవినీతికి పాల్పడుతూ ప్రకృతి సంపదను తమ అక్రమార్జనకు వినియోగించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి అధికారుల పనితీరు వల్ల మండలంలో రోజూ కలప అధికారుల కనుసన్నల్లో జిల్లా కేంద్రంలో మిల్లులకు చేరుతోంది. కొందరు అక్రమార్కులు సిండికేట్‌గా మారి కట్టెల మిషన్‌కు అక్రమంగా తరలించే కలపకు అనుగుణంగా రోజూ ఆటవీశాఖ అధికారులకు మామూళ్లు ముట్టచెబుతున్నట్లు సమాచారం. దీనివల్లే క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన

కురుపాం ప్రధాన రహదారి మీదగా ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న కలప

ఆటవీశాఖ అధికారులు కట్టెల మిషన్ చుట్టూ ఉదయం, సాయంత్రం ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇష్టారాజ్యంగా టేకు, మామిడి, తదితర అటవీ జాతి చెట్లను నరికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు కనీసం పర్యవేక్షించకపోవడం దుర్మార్గం. చెట్ల నరికివేత, కలప అక్రమ తరలింపు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో అడవుల్లో పచ్చదనం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇకనైనా అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి మండల పరిధిలో చెట్ల నరికివేతకు అడ్డుకట్ట వేసి ఆటవీ సంపద, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రకృతి సంరక్షకులు, పర్యావరణ ప్రేమికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

16న మోడల్ నవోదయ గ్రాండ్ టెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 16న మోడల్ నవోదయ గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ మండల ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి గ్రాండ్ టెస్ట్ ప్రారంభమవుతుందని, ఆసక్తి గల విద్యార్థులు 8639618305, 8309840460, 9949924047, 9618867505 నెంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సచివాలయాలను సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరకండి, చినబోగిలి సచివాలయాలను ఎంపిడిఒ సిహెచ్ వెంకట్రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలు, అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. అక్కడ పిల్లలు హాజరు పట్టికలో ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయంలో వచ్చే సమస్యలపై వెంటనే పరిష్కరించే దిశగా చూడాలన్నారు. ఆయన వెంట సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రుడ్ని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

గాయపడిన కళాసీని సిఐటియు నాయకుల పరామర్శ

ఆర్‌టిసి ఇన్సూరెన్స్ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో బాణాసంచా పార్సెల్ డెలివరీ చేసే క్రమంలో జరిగిన పేలుళ్లలో కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కళాసీ రెడ్డి రమేష్, అద్దె బస్సు డ్రైవర్ తెర్లి రవి తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ మేరకు కర్షక మహర్షి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వీరిని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఘటనకు ఆర్టీసీ పార్సెల్ సర్వీస్ విభాగం, అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ నిబంధనల ప్రకారం బస్సుల్లో నిషేధిత, ప్రమాదకర వస్తువులు రవాణా చేయకూడదని, దాన్ని గమనించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారని వీరందరికీ మెరుగైన వైద్యమందించాలని డిమాండ్ చేశారు. విశాఖ కెజిహెచ్‌లో వైద్యం పొందుతున్న రెడ్డి రమేష్‌కు వైద్యం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని, ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్‌టిసి కళాసీలకు, అద్దె బస్సు డ్రైవర్లకు ప్రమాద బీమా ఆర్‌టిసి సంస్థ చేయించా కోరారు. దీనికి ఆర్‌టిసి డిపో మేనేజర్ లక్ష్మణరావు స్పందిస్తూ ఈ సమస్యపై ఇప్పటికే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని, కార్మికులను ఆదుకునేందుకు, మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్టీసీ తరఫున ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి. ఇందిర, రెడ్డ వేణు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.శివాని, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

టిడిపి బలోపేతానికి రాబోయే స్థానిక ఎన్నికల్లో శతశాతం విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం మండల క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేట కూడలిలో ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్విన్ పేట కూడలి నుండి బి.ఎస్.ఆర్ కళ్యాణ మండపం వరకు పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని అప్పుడే ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అప్పుడే విజయం సాధించే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర ట్రైకార్ బోర్డ్ డైరెక్టర్ పువ్వల లావణ్య, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదన్‌రావు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ శేఖర్ పాత్రుడు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, టిపిసి సభ్యులు నందివాడ కృష్ణబాబు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు మరడాన తవిటి నాయుడు, సీనియర్ నాయకులు నంగిరెడ్డి మధుసూదనరావు, గుల్లిపల్లి సుదర్శన్ రావు, పొట్నూరు వెంకటనాయుడు, విజయంకుశం, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురాన శ్రీరామూర్తి నాయుడు, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు వావిలపల్లి దివాకర్, ఎపిటిసి కోట సుమన్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కె.వి.కొండయ్య, జోగి భుజంగరావు, మరడాన నారాయణ స్వామి నాయుడు, నాయకులు పాడి సుదర్శన్ రావు, సోములు మాస్టర్, బిడ్డికి తమ్మయ్య, దాసరి రామారావు, ఆరిక విప్లవ కుమార్, కిషోర్, కృష్ణమూర్తి నాయుడు, హైమావతి ఐదు మండలాలకు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - సాలూరు

వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పట్టణ పోలీసులు అందించిన సమాచారం ప్రకారం పట్టణంలోని బంగారమ్మపేటకు చెందిన దేవిపల్లి వెంకటరావు తన భార్య లక్ష్మితో కలిసి విశాఖపట్నంలోని తన కూతురు ఇంటికి వెళ్లారు. ఈనెల 9న అర్ధరాత్రి వెంకటరావు పక్కింటి నివాసి అయిన బూరాడ శేఖర్ ఫోన్ చేసి, మీ ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు పడ్డారని సమాచారం ఇచ్చారు. దీంతో వెంకటరావు తిరిగి వచ్చి బీరువాను తనిఖీ చేయగా, అందులోని రూ.37వేలు నగదు, ఏడు గ్రాముల బంగారు వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు గుర్తించి, ఈనెల 12న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం మధ్యాహ్నం 1 గంటలకు పట్టణం నుంచి జీగిరాం వైపు వెళ్లే మెయిన్ రోడ్డులోని ఓల్డ్ బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో స్కూటీపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు ముగ్గురు చెడు అలవాట్లకు బానిసలై డబ్బుల కోసం దొంగతనం చేద్దామనే ఉద్దేశంతో ఈనెల 9న రాత్రి 11.30 గంటల సమయంలో బంగారమ్మపేటలోని తాళం వేసిన ఇంటికి వెళ్లి, తమ వద్ద ఉన్న స్క్రూడ్రైవర్, జాకీరాడ్ల సహాయంతో ఇంటి తాళాలు, బీరువాను పగలగొట్టి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి చోరీకి గురైన రూ.32వేలు నగదు మరియు 6.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ అప్పలనాయుడు తెలిపారు. దొంగతనానికి పాల్పడినవారి బొత్స నవీన్ (19), కోడూరు కార్తీక్ (18), మడుగులు వంశీ (18) ఉన్నారు. వీరు బంగారమ్మ కాలనీకి చెందినవారేనని పోలీసులు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన ఈ ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

శత శాతం పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి- రామభద్రపురం

అన్ని పంచాయతీల్లో ఇళ్ల పన్నుల వసూళ్లు శతశాతం పూర్తి చేయాలని డివిజనల్ డవలప్మెంట్ ఆఫీసర్ కిరణ్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు నెలాఖరులోగా ఈ లక్ష్యాలను సాధించాలని, ఆన్‌లైన్‌లో మాత్రమే ఇళ్ల పన్నుల వసూళ్లు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రతీరోజూ శానిటేషన్, తాగునీరు నిర్వహణ పనులు చేపట్టి పిఆర్-1 యాప్లో అప్లోడ్ చేయాలన్నారు. సిటిజన్ ఇకెవైసి, ఎండియు సర్వే పూర్తిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రత్నం, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు, ఇఒ సూరిబాబు, వివిధ గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు..

పంట మార్పిడితో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

పంట మార్పిడి విధానంతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని నార్త్ కోస్టల్ రీజనల్ థిమెటిక్ లీడ్ కె.ప్రకాష్, రీజనల్ టెక్నికల్ అధికారి జి హేమ సుందర్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు రైతులకు సూచించారు. జియమ్మ వలస మండలం అల్లువాడలో ఆధ్వర్యంలో పంట మార్పిడి విధానంలో భాగంగా రబీలో మినుములతో పాటు కంది, ఆముదం, సజ్జ, జొన్న, గోరుచిక్కుడు, గోంగూర, ముల్లంగి పంటలను రైతులు గోపాలరావు, తిరుపతి రావు 2ఎకరాలు విస్తీర్ణంలో సాగు చేస్తున్న విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించడానికి, భూమిని సారవంతం చెందడానికి, పురుగులు తెగుళ్లు రాకుండా ఉండడానికి, పంటల అధిక దిగుబడులకు పంట మార్పిడి విధానం ఏకైక మార్గమని అన్నారు. 70రోజుల్లో మినుము పంట అయిపోతుందని, మిగిలిన పంటలు వేసవిలో ఖాళీగా ఉండకుండా ఈ పంటలు భూమిని కప్పి ఉంచి పచ్చగా ఉంటాయని తెలిపారు. వీటి ద్వారా భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయని, భూమి కూడా సారవంతమవుతాయని తెలిపారు. మొక్కల్లో జీవవైవిధ్యం పెంపొందించడం జరుగుతుందని భూమిలో నత్రజని స్థాపక బ్యాక్టీరియాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ విధంగా వేసుకోవడం వల్ల ఏ విధమైన రసాయనికి ఎరువులు, పురుగు మందులు వాడుకుంటా, పెట్టుబడి లేకుండా, దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతుందని తెలిపారు. రీజనల్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అన్ని గ్రామాల్లో పంట మార్పిడి విధానం ద్వారా ఈ విధంగా పంటలు వేయడానికి కార్యకర్తలు అందుబాటులో ఉండాలని, రైతులకు కూడా అవగాహనపర్చి ఆచరించేలా చేయాలని సూచించారు. ప్రతి రైతు వరి కోసిన వారం రోజుల ముందు ఇలా వేసుకోవాలని, ప్రధాన పంటతో పాటు మిగిలిన పంటలు వల్ల అధిక ఆదాయం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరాం, లక్ష్మణరావు, వివిఎ రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఐటిడిఎలో నేడు పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో శుక్రవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి 2 గంటల వరకు ఐటిడిఎలోని ఎస్.ఆర్.శంకరన్ మీటింగ్ హాల్ నందు ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పీవో తెలిపారు.

చిట్టిపూడివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలసలో గురువారం వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, జ్వరపీడుతులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శు భారాతమని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా లు పాల్గొన్నారు.

మన డబ్బులు మన లెక్కలపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక మండల సమాఖ్యలో మన డబ్బులు - మన లెక్కలు పై గ్రామ సంఘాల సభ్యులకు గురువారం అవగాహన కల్పించామని ఎపిఎం వెంకటరమణ తెలిపారు. ముమ్మనివానిపాలెం, అప్పన్నదొరపాలెం, దేశపాత్రునిపాలెం, చింతలపాలెం, రామలింగపురం, దేవాడ, అడ్డూరువానిపాలెం, అర్దన్నపాలెం గ్రామాల సభ్యులకు ఈ సదస్సు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిసిలు భారతి, అప్పలనాయుడు, అప్పలస్వామి, పద్మావతి, విఒఎలు, ఈ నారీలు పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల వాహన మంజూరుకు ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపిడిఒ సతీష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ 100శాతం సబ్సిడీతో వాహనాలను అందిస్తుందన్నారు. ఈనెల 25 నాటికి 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తులకు అర్హులన్నారు. కావున ఈనెల 25 లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

నేడు మాదిగ వేల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పర్యటన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మాదిగ వేల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు మర్రిచెన్నారెడ్డి భవనంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

మా భూములకు రక్షణ కల్పించండి

గిరిజనులు ఆందోళన

ప్రజాశక్తి - వీరఘట్టం

సభలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ పిఎఐస్ జగన్నాథ్

వ గా భూములకు రక్షణ కల్పించాలని పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను పెద్ద గదబవలస పంచాయతీ సందిమాను గూడ గ్రామ గిరిజనులు కోరారు. ఇదే సమస్యలపై ఈనెల 10న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులు వచ్చి మీ భూములు కొనుగోలు చేస్తామని ప్రలోభాలు పెడుతున్నారని, ఈ కారణంగా తమ భూములను కోల్పోతామన్న భయం వెంటాడుతుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సబ్ కలెక్టర్ ఆ గ్రామానికి చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. ఈ భూములకు రక్షణగా తాము ఉంటామని, ఎటువంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని గిరిజనులకు భరోశా ఇచ్చారు. ఎస్సై జి.కళాధరకు ఈ గ్రామ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు స్థానిక తహశీల్దారు విఎస్ కామేశ్వరరావు, ఆర్ఐ రవితేజ, విఆర్ఒ జి.రాజేంద్రప్రసాద్ గిరిజనులు పాల్గొన్నారు.

పనులు వాయిదా వేయండి

ఎంపిడిఒకు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి

ప్రజాశక్తి - మెరకముడిదాం

మండలంలో వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఐదు వారాలు పని వెసులుబాటు కోరుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపిడిఒ గొర్లె భాస్కరరావుకు గురువారం వినతిని అందజేశారు. ప్రస్తుతం మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు పాల్గొనడం కష్టంగా ఉందని ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. అధిక వర్షాల వల్ల భూముల్లో నీరు నిల్వ ఉండటంతో ఉపాధి పనులు చేపట్టడానికి అనుకూల పరిస్థితులు లేవని పేర్కొన్నారు. రైతుల ఫారం ఫాండ్స్, కంపోస్ట్ పిట్స్ తవ్వినందుకు ఆసక్తి చూపడం లేదని, భూములకు అధిక ధరలు పెరగడంతో ఈ పనులు ముందుకు సాగడం లేదని వివరించారు. తాము నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఐదు వారాలు వెసులుబాటు ఇవ్వాలని కోరారు. లక్ష్యం పేరుతో ఒత్తిడి చెయ్యొద్దని విజ్ఞప్తి చేశారు.

16న ఎఐఎఫ్‌టియు (న్యూ) జిల్లా సదస్సు

విజయనగరం టౌన్ : ఈనెల16 నగరంలోని రెవెన్యూ కళ్యాణ మండపంలో జరిగే ఎఐఎఫ్‌టి యు (న్యూ) జిల్లా సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా పిలుపునిచ్చారు. గురువారం సంఘం కార్యాలయంలో సదస్సుకు సంబందించిన గోడపత్రిక ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రైవేట్ రంగంలో వ్యవసాయ ఆధారిత జ్యూట్, పంచదార మిల్లులు ఉండేవని, వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం లేక అటు వ్యవసాయం, ఇటు దానిపై ఆధారపడ్డ మిల్లులు మూతపడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రెడ్డి నారాయణరావు, విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అప్పలరాజు రెడ్డి, విజయనగర్ బయోటెక్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.అక్కునాయుడు, కొత్తవలస జూట్ కార్మిక నాయకులు ఎస్. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక నగర పంచాయతీలో గురువారం రాత్రి టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి, ఎపి మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. నెల్లిమర్లకు చెందిన బొద్దాన వెంకటేష్‌కి రూ. 72,262 చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, టౌన్ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, గురాణ చక్రి, తదితరులు పాల్గొన్నారు.